క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి

ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, సానుభూతిపరులందరూ సైనికుల్లా పని చేసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు అన్నారు. వైఎస్సార్ సీపీ ముఖ్యనాయకుల, కార్యకర్తల సమావేశాన్ని శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతాప్ మాట్లాడుతూ ఎవరు ఎవరితో కలిసిన జగన్‌మోహన్ రెడ్డి మాత్రం సింహంలాగా సింగిల్‌గానే వస్తారని, సింహాన్ని చూసి నక్కలన్నీ పారిపోవడం ఖాయమన్నారు. ప్రతి ఇంటికీ రెండు కంటే ఎక్కువే సంక్షేమ పథకాలు అందాయని, శనివారం నుంచి పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అమలు చేసిన పథకాల కరపత్రాలను పంచిపెట్టాలని, కౌన్సిలర్లు, నాయకులు, బూత్ కమిటీ కన్వీనర్లు, సభ్యులు, గృహసారథులు అందరూ రావాలన్నారు. నేను మీకు పనిచేస్తేనే నాకు ఓటేయండన్న దమ్మున్న ముఖ్యమంత్రి దేశంలో వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఒక్కరేనని, అలాంటి నాయకుడి వెనుక మనమందరం నడవడం గొప్ప విషయమన్నారు. నూజివీడు పట్టణానికి రూ.16కోట్లు మంజూరు చేశారని, ఈ నిధులను పనులను త్వరలోనే చేపడతామన్నారు. మున్సిపల్ కో ఆప్షన్ సభ్యులు రామిశెట్టి మురళీకృష్ణ, మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, ముసునూరు జెడ్పీటీసీ సభ్యుడు వరికూటి ప్రతాప్, నాయకులు షేక్ గబ్బర్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీ విభాగం ఏలూరు జిల్లా అధ్యక్షులు పిళ్లా చరణ్,నూజివీడు సొసైటీ అధ్యక్షులు బొబ్బిలి సాయిబాబు పాల్గొన్నారు.

నేడు ఎంపీ కేశినేని పర్యటన

గంపలగూడెం: మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాల్లో విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాసరావు (నాని), వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ సమన్వయకర్త నల్లగట్ల స్వామిదాసులు శనివారం పర్యటిస్తారు. మేడూరులో ఉదయం 10 గంటలకు రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్‌సెంటర్, అమ్మిరెడ్డిగూడెంలో 11గంటలకు గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను ప్రారంభిస్తారు. గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అదనపు బిల్డింగ్, క్యాష్ కౌంటర్లను కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తాతినేని పద్మావతితో కలసి ఎంపీ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 12 గంటలకు గంపలగూడెం మండల పరిషత్ కార్యాలయం వద్ద వైఎస్సార్ చేయూత పథకం ప్రారంభం, ఇళ్లస్థలాల పంపిణీ చేస్తారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని పార్టీ మండల అధ్యక్షుడు చావా వెంకటేశ్వరరావు తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత



ఇబ్రహీంపట్నం: బాధిత కుటుంబానికి మంత్రి జోగి రమేష్ కృషితో రెండు లక్షల రూపాయల విలువైన చెక్కును శుక్రవారం అందజేశారు. ఎనిమిది నెలల క్రితం ఎన్టీటీపీఎస్ కూలింగ్ కెనాల్‌లో చేపలు పట్టేందుకు వెళ్లిన శీలం వెంకటేశ్వరరావు ప్రమాదవశాత్తు మృతి చెందాడు. అప్పట్లో మృతుడి కుటుంబ సభ్యులు మంత్రి జోగి రమేష్‌ను ఆశ్రయించి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి రూ.2 లక్షల చెక్కు మంజూరు చేయించారు. నియోజకవర్గం ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు, సీనియర్ నాయకులు జోగి రాము చెక్కును మృతుడి భార్య పూర్ణిమకు అందజేశారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర సహాయ కార్యదర్శి మేడపాటి నాగిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు ప్రశంసనీయం

చంద్రగూడెం (మైలవరం): వలంటీర్ల సేవలు ప్రశంసనీయమని వైఎస్సార్ సీపీ మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు తెలిపారు. మండలంలోని చంద్రగూడెం గ్రామ సచివాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తిరుపతిరావు మాట్లాడుతూ వలంటీర్లు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిలా పనిచేయాలన్నారు. ఎక్కడా కూడా అలసత్వం అనేది లేకుండా వారి పరిధిలో ఉన్న లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను అందజేస్తూ, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. వలంటీర్లకు ప్రోత్సాహకాలు అందజేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

విస్సన్నపేట: గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో స్థానిక సెయింట్ థెరిస్సా పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు శుక్రవారం ప్రారంభించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి, వైస్ ఎంపీపీ రెడ్డి శ్రీనివాసరావు, సచివాలయాల మండల కన్వీనర్ అనుమోలు శివబాజీ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు నెక్కలపు కుటుంబరావు, జిల్లా కమిటీ సభ్యులు ప్రకాష్, మాజీ వైస్ ఎంపీపీ దుర్గారావు, ఏఎంసీ డైరెక్టర్ శేషగిరి, సొసైటీ అధ్యక్షుడు ముత్యాలరావు, మాజీ సర్పంచ్ పల్లెపాం లక్ష్మయ్య, ఎంపీటీసీ జి.మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

శివయ్యకు భక్తజన నీరాజనం

- శివాలయాలకు పోటెత్తిన భక్తులు
- లింగోద్భవ కాలంలో అధిక సంఖ్యలో అభిషేకాలు
- ఆలయాలను దర్శించిన ప్రముఖులు



చాత్రాయి చెరువులో పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేస్తున్న భక్తులు



కోట శివాలయంలో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు ఆశీర్వచనం



వెల్వడం శివాలయం వద్ద కోనేటిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



కొండపర్వలో అన్నసమారాధన ప్రారంభిస్తున్న నల్లగట్ల స్వామిదాసు



పవిత్రసంగమం వద్ద అధికారులకు సూచనలు ఇస్తున్న సీపీ టీకే రాణా

మైలవరం: మహాశివరాత్రి ఉత్సవాలను మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గాల పరిధిలోని శివాలయాల్లో అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రసిద్ధిగాంచిన ఆలయాలకు భక్తులు పోటెత్తారు. శివయ్యకు భక్తులు నీరాజనాలు పలికారు. మైలవరం మండలంలోని వెల్వడం గ్రామంలోని శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయం సమీపంలోని కోనేటిలో స్నానాలు ఆచరించారు. మహిళలు, వృద్ధులు కోనేటి వద్ద ఏర్పాటు చేసిన జల్లు స్నానాలతో సరిపెట్టుకున్నారు. స్నానాలు నిర్వహించిన అనంతరం పెద్దలకు పూజలు నిర్వహించి తర్పణలు వదిలారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు నిర్వహించారు. శ్రీబాలకోటేశ్వరస్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయంలోని ధ్వజ స్తంభం వద్ద పూజలు నిర్వహించారు. మైలవరంలోని పాత శివాలయంలో భక్తులు పూజలు నిర్వహించారు. పుల్లూరులోని శివాలయంలో భక్తులు విశేష సంఖ్యలో భక్తులు చేరుకుని పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

భక్తిశ్రద్ధలతో శివరాత్రి పుణ్యస్నానాలు

ఇబ్రహీంపట్నం: మహాశివరాత్రి పండుగ పురస్కరించుకుని కృష్ణానది తీర గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు ఆచరించారు. ఇబ్రహీంపట్నం పవిత్ర సంగమం, గుంటుపల్లి పుష్కరఘాట్, దాములూరు, తుమ్మలపాలెం, గ్రామాల్లో శుక్రవారం తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి భక్తులు ఘాట్లకు చేరుకున్నారు. నదిలో నీటిమట్టం తగ్గటంతో అధికారులు ఏర్పాటు చేసిన జల్లు స్నానాలు చేశారు. అర్చకుల సమక్షంలో పితృదేవతలకు పిండ ప్రదానం చేశారు. పలు గ్రామాల్లో శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. మైలవరం నుంచి ఆర్టీసీ బస్సులు ఏర్పాటు చేశారు. శివరాత్రి ఏర్పాట్లను నియోజకవర్గం ఇన్‌చార్జ్ సర్నాల తిరుపతిరావు పార్టీ నాయకులతో కలసి పరిశీలించారు.

సీపీ టీకే రాణా పర్యటన

ఫెర్రీ పవిత్ర సంగమం వద్ద పుణ్యస్నానాలు చేసేందుకు భక్తులకు ఏర్పాటు చేసిన వసతులను విజయవాడ నగర సీపీ టీకే రాణా పరిశీలించారు. వైద్య శిబిరం, దుస్తులు మార్చుకునే టెంట్లు, స్వచ్ఛంద సంస్థల సేవలు పరిశీలించారు. లా అండ్ ఆర్డర్ డీసీపీ ఏఎస్ రాణా, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సీఐ ఎం.సత్యన్నారాయణ, వైద్య ఆరోగ్య శాఖ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు: స్థానిక శ్రీచంద్రమౌళీశ్వరాలయం, శ్రీరామలింగేశ్వరాలయం, శ్రీగౌరీ కేదారేశ్వరాలయాల్లో తెల్లవారుఝాము నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణాన్ని శాస్త్రోక్తంగా జరిపారు. తిరువూరు సమీపంలోని ఖమ్మం జిల్లా నీలాద్రి, గుట్టపాడు, కల్లూరు దేవాలయాలకు కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. తిరువూరు ఆర్టీసీ డిపో నుంచి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపారు.

భక్తిశ్రద్ధలతో శివయ్యకు పూజలు

గంపలగూడెం: మహాశివరాత్రి పర్వదినం మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. తెల్లవారుఝాము నుంచే భక్తులు శైవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంపలగూడెం గంగా పార్వతి, భ్రమరాంబ, బాలాత్రిపురసుందరీ దేవి సమేత రామలింగేశ్వరస్వామి, మేడూరు వెయ్యినూటపదహారు శివలింగాల జీవన్ముక్తేశ్వరస్వామి ఆలయం, రామలింగేశ్వరస్వామి, గోసవీడు విశ్వేశ్వరస్వామి ఆలయం, కొత్తపల్లి ఉమాగౌరీశంకర ఆలయం, నెమలి శివాలయం, పెనుగొలను రామలింగేశ్వర స్వామి ఆలయాల్లో శివరాత్రి ప్రత్యేక కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆయా ఆలయాల్లో త్రినేత్రునికి నిర్వహించిన పంచామృతాలతో అభిషేకం, రుద్రాభిషేకం, మారేడు దళాలతో అర్చన తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను ఘనంగా జరిపారు.

వైభవంగా శివరాత్రి పూజలు

చాట్రాయి: మండలంలోని శివాలయాలు శుక్రవారం భక్తులతో కిక్కిరిశాయి. చాట్రాయి గ్రామంలోని రామలింగేశ్వర స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయం ఎదురుగా ఉన్న పెద్ద చెరువులో భక్తులు స్నానమాచరించి పితృ దేవతలకు పిండ ప్రదానాలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జల్లు స్నానాలు ఏర్పాటు చేశారు. ఏపీ కో-ఆపరేటివ్ యూనియన్ రాష్ట్ర చైర్మన్ దేశిరెడ్డి స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 12 వేల మందికి అన్నదానం చేశారు. సి.గుడిపాడు, తుమ్మగూడెం, పోలవరం గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు స్వామి వారికి పూజలు చేశారు.

శివనామస్మరణతో మార్మోగిన శివాలయాలు

నూజివీడు: మండలంలోని శివాలయాలన్నీ శివనామస్మరణతో మార్మోగాయి. పట్టణంలోని కోట లోపల శివాలయానికి భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ఉదయం నుంచి స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం దుర్గామల్లేశ్వరుడికి కల్యాణం నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవీ వనితా క్లబ్, వాసవీ క్లబ్‌ల ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వినియోగం నిర్వహించారు.

స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే

కోట లోపల శివాలయంలోని స్వామివారిని ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు దర్శించుకున్నారు. ముందుగా ఎమ్మెల్యేకి వేదపండితులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేదపండితులు ఎమ్మెల్యేకు ఆశీర్వచనాలు అందించారు. ఎమ్మెల్యే ప్రతాప్ వెంట మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ ఉన్నారు. పట్టణంలోని బస్టాండు సమీపంలో కొలువైన శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ఉదయం అభిషేకం నిర్వహించారు. సాయంత్రం దుర్గామల్లేశ్వరస్వామి వారికి కల్యాణం చేశారు. అనంతరం స్వామి వారిని నంది వాహనంపై ఊరేగించారు. అన్నవరంలో కొలువైన స్వయంభు శ్రీవల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్య స్వామి ఆలయంలో శుక్రవారం స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు భావరాజు పుల్లారావు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

భక్తిశ్రద్ధలతో పుణ్యస్నానాలు

గంపలగూడెం: మహాశివరాత్రి సందర్భంగా మండలంలోని కట్టలేరులో గోపాలస్వామి మడుగులో భక్తులు పెద్దసంఖ్యలో పుణ్యస్నానాలు ఆచరించారు. ఏటిలో నీటిప్రవాహం అంతగా లేకపోవడంతో కమిటీ సభ్యులు జల్లుస్నానాలు ఏర్పాటు చేశారు. సంప్రదాయబద్ధంగా కొందరు పితృదేవతలకు పిండప్రధానం చేశారు. గంపలగూడెం, ఏకొండూరు, తిరువూరు, తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం, మధిర మండలాల నుంచి భక్తులు ఆయా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

విస్సన్నపేట: మండలంలోని కొండపర్వ గ్రామంలో భ్రమరాంబిక మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు కొండపైకి ఎక్కి మొక్కులు తీర్చుకున్నారు. దిగువన ఉన్న దేవాలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తిరువూరు నియోజకవర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయట్రస్టు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి, గ్రామ సర్పంచ్ జి.రమేష్‌బాబు, ఆలయ చైర్మన్ జి.బుచ్చి వెంకట్రామ్మ లక్ష్మీనరసింహారావు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. విస్సన్నపేట చంద్రశేఖరస్వామి దేవస్థానంలో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. పోతులూరు వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో స్వామివారి కల్యాణ మహోత్సవం నిర్వహించి అన్నసమారాధన చేశారు.

బలివేలో భక్తుల కిటకిట



బలివేలో పిండ ప్రదానాలు, జల్లు స్నానాలు చేస్తున్న భక్తులు

బలివే (ముసునూరు): మండలంలోని బలివే బలే రామలింగేశ్వరాలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. స్వామి వారి దర్శనం గురువారం అర్ధరాత్రికే భక్తులు ఆలయ ప్రాంగణంలో బారులు తీరారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారికి విశేష అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులకు సర్వదర్శన అవకాశం కల్పించారు. దేవదాయ, రెవెన్యూ, పంచాయితీరాజ్, పోలీసు, తమ్మిలేరు నీటిపారుదల, వైద్యారోగ్య శాఖలతోపాటు, పంచాయతీ సమన్వయ కృషి ఫలితంగా ఉత్సవాలు విజయవంతమైనట్లు, గ్రామ సర్పంచ్ రావు ప్రవీణ, చైర్మన్ నాగేశ్వరరావు, ఈఓ సతీష్‌కుమార్, తహసీల్దార్ జవహర్‌బాజి తెలిపారు. ఉమ్మడి పశ్చిమ, ఉమ్మడి కృష్ణా జిల్లాల సరిహద్దు కావడంతో ఇరువైపులా నాయకులు బలివే ఉత్సవాలను ప్రతిష్ఠాత్మకంగా భావించి ఏర్పాట్లు చేయించడంతో భక్తులు బలివే ప్రాంగణానికి పోటెత్తారు. గ్రామ వైఎస్సార్ సీపీ నేత రావు సుధాకర్ ఆధ్వర్యంలో జల్లు స్నానాలకు గతంలో కన్నా ఎక్కువ మోటార్లు ఏర్పాటు చేయించారు.

స్వామిని దర్శించుకున్న ప్రముఖులు

నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఎమ్మెల్యే పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్, ఎంపీపీ కొండా దుర్గాభవాని, వైస్ ఎంపీపీ గంగాధర్, నూజివీడు మాజీ వైస్ చైర్మన్ పగడాల సత్యనారాయణ, జిల్లా రైతు సంఘం నేత పల్లె రవీంద్రరెడ్డి, నూజివీడు డీఎస్పీ గోలి లక్ష్మయ్య, సి.ఐ రామకృష్ణ, ఎంపీడీఓ పద్మావతీదేవి, తదితరులు స్వామి వారిని దర్శించుకున్నారు.

విశేష సేవలు..

బలివే మహాశివరాత్రి ఉత్సవాలలో ప్రభుత్వ సంస్థల అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భక్తులకు విశేష సేవలనందించారు. వైద్యాధికారి షకీనా ఇవాంజిలిన్ ఆధ్వర్యంలో వైద్యులు కరీముల్లా, భవాని,గౌతమ్ నిర్వహించిన వైద్యశిబిరంలో 620 మందికి వైద్య పరీక్షలు చేశారు. జేబు దొంగతనాలను నివారించినట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థల ఆధ్వర్యంలో పులిహోరా, చక్రపొంగలి, బిస్కెట్ ప్యాకెట్లు, మజ్జిగ, మంచినీళ్ల ప్యాకెట్లు పంపిణీ చేశారు.

శోభనగిరిపై శివరాత్రి వేడుకలు

ఆగిరిపల్లి: స్థానిక సత్రం సెంటర్‌లో గంగా అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు శ్రీనివాసు అభిషేకాలు నిర్వహించారు. ఈదులగూడెం నాగేశ్వర స్వామి, సూరవరం మల్లేశ్వర స్వామి, కనసానపల్లి చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో భక్తులు బారులు తీరారు. స్థానిక వరహ పుష్కరిణి వద్ద ఉన్న ముక్తేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి స్వామి వారి కల్యాణం నిర్వహించారు. శోభనాచలుని ఎగువ కొండపై బ్రహ్మ సూత్ర సహిత స్వయంభు వెలిసిన దుర్గా పార్వతి సమేత మల్లికార్జున స్వామిని భక్తులు 850 మెట్లు ఎక్కి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

రూ.60 కోట్లతో గొల్లపూడి అభివృద్ధి

- సీఎం జగన్ ప్రభుత్వంలోనే ఇది సాధ్యమైంది
- విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని)



మాట్లాడుతున్న ఎంపీ కేశినేని నాని, చిత్రంలో ఎమ్మెల్సీ తలశిల రఘురాం, తిరుపతిరావు

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామాభివృద్ధికి రూ.60 కోట్లు ఖర్చు చేయటం అభినందనీయమని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) పేర్కొన్నారు. తాను ఎంపీగా ఉన్న పదేళ్ల కాలంలో విజయవాడ నగరాభివృద్ధికి నిధులు ఇవ్వాలని చంద్రబాబును అడిగితే ఇవ్వలేదని, అటువంటిది కేవలం గొల్లపూడి గ్రామాభివృద్ధికే రూ.60 కోట్లు ఖర్చు చేయడమంటే అది సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంతోనే సాధ్యమయ్యిందన్నారు. ఇందుకు ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్ తలశిల రఘురాం అభినందనీయడని కొనియాడారు. గొల్లపూడి మౌలానగర్‌లో జిల్లా, మండల పరిషత్ నిధులతోపాటు గ్రామ పంచాయతీ నిధులు కలిపి రూ.95 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన వైఎస్సార్ మైనార్టీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ఆయన ఎమ్మెల్సీ తలశిల రఘురాం, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావు యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. సూరాయిపాలెం గ్రామంలో దాత దాసరి రాధాకృష్ణ సుమారు రూ.70 లక్షల ఖర్చుతో నిర్మించిన శ్రీఅభయ వీరాంజనేయ స్వామి బీసీ కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభించారు. ల్యాంకో కాలనీలో మండల పరిషత్, గొల్లపూడి గ్రామ పంచాయతీ నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న బీసీ కమ్యూనిటీ హాల్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఎంపీ కేశినేని శ్రీనివాస్(నాని) మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఐదేళ్ల పని చేసిన దేవినేని ఉమామహేశ్వరరావు గొల్లపూడి గ్రామాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం గడిచిన 58 నెలల్లోనే రూ.60 కోట్లతో అభివృద్ధి చేయటంతో సర్వత్రా హర్షం వ్యక్తం అవుతోందన్నారు. గ్రామంలో 3,648 మందికిపైగా పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి రఘురాం పట్టుదలే కారణమని పేర్కొన్నారు. మైలవరం నియోజకవర్గంలో అపర కుబేరుడిపై వెనుకబడిన కులానికి చెందిన ఒక పేద సాధారణ వ్యక్తి, పార్టీ కార్యకర్త సర్నాల తిరుపతిరావు యాదవ్‌ను రానున్న ఎన్నికల్లో పోటీకి నిలిపిన సీఎం జగనన్నకు హ్యాట్సాఫ్ అన్నారు. సర్నాల తిరుపతిరావును గెలిపించి సీఎం జగన్‌కు కానుకగా ఇవ్వాల్సిన బాధ్యత నియోజకవర్గ ప్రజలపై ఉందన్నారు. ఎమ్మెల్సీ తలశిల రఘురాం మాట్లాడుతూ 2018లో స్థానిక ఎమ్మెల్యే దేవినేని ఉమామహేశ్వరరావు ఇక్కడ రూ.1.75 కోట్లతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తానని మైనార్టీలను మోసం చేశాడన్నారు. పదేళ్లపాటు నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా, మంత్రిగా పని చేసి గొల్లపూడి గ్రామాభివృద్ధికి చేసింది శూన్యమన్నారు. కేవలం 10 నెలల్లో దాదాపు కోటి రూపాయల వ్యయంతో మైనార్టీల కోసం కమ్యూనిటీ హాల్ నిర్మించి వారి చిరకాల కోరికను సాకారం చేశామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో విజయవాడ ఎంపీగా కేశినేని శ్రీనివాస్ (నాని)ను, మైలవరం నియోజకవర్గ ఇన్‌చార్జి సర్నాల తిరుపతిరావును అత్యధిక మెజారిటీతో గెలిపించుకోవడంతోపాటు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా చేసుకుంటామని స్పష్టం చేశారు. సర్నాల తిరుపతిరావు యాదవ్ మాట్లాడుతూ మైలవరం నియోజకవర్గంలో పోటీ చేసేందుకు రూ.100 కోట్లు ఖర్చు చేస్తానని ఒకరంటే, రూ.200 కోట్లు ఖర్చు పెడతానని మరొకరు పోటీ పడుతున్న తరుణంలో బీసీ సామాజకవర్గానికి చెందిన సాధారణ వ్యక్తినైన తనను పోటీకి ఎంపిక చేసిన సీఎం జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటానని చెప్పారు. మైలవరం నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు కిరణ్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీ కె.సువర్ణరాజు, ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నూజివీడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా కృష్ణవేణి

నూజివీడు: నూజివీడు ఏఎంసీ చైర్‌పర్సన్‌గా కంభాల కృష్ణవేణిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. వివరాలను ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు శుక్రవారం తెలిపారు. ఏడాది కాల పరిమితితో పాలకవర్గంలో ఎమ్మెల్యే గౌరవ చైర్మన్‌గా ఉంటారు. వైస్ చైర్మన్‌గా బర్మా సీతారామయ్య, మరో 17 మంది సభ్యులను నియమించారు. మహ్మద్ అజీజున్నీసా, మద్దాల రూత్‌మేరీ, గుండ్ల లక్ష్మి, యెదురేసి యరకయ్య, అబ్బూరి రంగారావు, మాలాతు శ్రీమన్నారాయణ, వనమా సునీత, ఉమ్మడి వెంకటరమణ, చిన్ని నాగరాణి, రావి విష్ణువర్ధనరావు, యర్రంశెట్టి నాగేశ్వరరావు, పామర్తి శివ నాగేశ్వరరావు, చిట్లూరి శ్రీనివాసరావు, పోలవరం పీఏసీఎస్ అధ్యక్షులు, జిల్లా అగ్రి ట్రేడ్ అండ్ మార్కెటింగ్ అధికారి, నూజివీడు ఏడీఏ, నూజివీడు మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌లను నియమించారు.

విద్యతోనే మహిళల సర్వతోముఖాభివృద్ధి

తిరువూరు ఆర్డీవో మాధవి



మాట్లాడుతున్న తిరువూరు ఆర్డీవో మాధవి

తిరువూరు: విద్యతోనే మహిళల సర్వతోముఖాభివృద్ధి జరుగుతుందని, తల్లిదండ్రులు తమ కుమార్తెలను ఉన్నత చదువులు చదివించాలని తిరువూరు ఆర్డీవో కే మాధవి అన్నారు. స్థానిక ఆస్టర్ అమరావతి ఆసుపత్రి ఆవరణలో శుక్రవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పలువురు మహిళా అధికారులు, వైద్యులను సన్మానించారు. ముఖ్య అతిథి, ఆర్డీవో మాట్లాడుతూ బాలికా విద్యకు ప్రభుత్వాలు ఎంతో ప్రాధాన్యం ఇస్తున్నందున తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, వ్యవసాయాధికారి పద్మ, డాక్టర్ కోనేరు లక్ష్మి, కావ్య, మధుకీర్తి పాల్గొన్నారు.

మహిళా శక్తి చాలా గొప్పది

చాట్రాయి: మహిళా శక్తి అపారమైనదని పోలవరం కేపీ ప్రాథమిక పాఠశాల హెచ్ఎం ఆర్.నాగేశ్వరావు తెలిపారు. శుక్రవారం స్థానిక పాఠశాల్లో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మహిళలను సన్మానించారు.

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మహిళలు అన్ని రంగాల్లో రాణించి సమాజానికి స్ఫూర్తిగా నిలవాలని ఎంఈవో సీహెచ్ పుష్పలత అన్నారు. కొండపల్లి జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలను సత్కరించారు. జేవీవీ జిల్లా ఉపాధ్యక్షుడు కామేశ్వరరావు, అడ్వకేట్ నాగరాజు, హెచ్ఎం సంతోష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు. నిమ్రా కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రముఖ రేడియాలజిస్ట్ షేక్ సుల్తానా, నిమ్రా వైద్యశాల సూపరింటెండెంట్ శ్యామలాదేవి, ప్రిన్సిపాల్ సాహిత్య హాజరయ్యారు. చదువులో ప్రతిభ కలిగిన వారికి సర్టిఫికెట్లు, అవార్డులు అందజేశారు.

మహిళల చదువు సమాజానికి వెలుగు

వెల్వడం(మైలవరం): మహిళ చదువు సమాజానికి వెలుగు నిస్తుందని పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షుడు పీ.గోపాల్ తెలిపారు. వెల్వడం గ్రామంలోని జెడ్పీ పాఠశాల ప్రాంగణంలో పీఆర్‌టీయూ మైలవరం శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సీనియర్ ఉపాధ్యాయులు ఎమ్.అరుణకుమారి, పీ నిర్మలాదేవిలను ప్రధానోపాధ్యాయులు సాయి కుమారి, సుధారాణి శాలువలతో సత్కరించారు. ఉపాధ్యాయులు శేషగిరిరావు, సతీష్, సూరిబాబు, పుల్లారెడ్డి పాల్గొన్నారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి మాట్లాడుతూ కళాశాలకు చెందిన విద్యార్థిని ఎస్.విజయ భార్గవికి బెస్ట్ ఔట్ గోయింగ్ స్టూడెంట్ అవార్డు రావడం, త్రిష పూజిత విమెన్ ఐపీఎల్‌కి ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కోఆర్డినేటర్ సుభాషిణి పర్యవేక్షించారు.

ఇబ్రహీంపట్నం: మండలంలోని కేతనకొం గ్రేస్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. గ్రేస్ మినిస్ట్రీస్ సెక్రటరీ సుమలత, అమెరికా దేశస్తురాలు లిండ్సే మాట్లాడుతూ మహిళలు సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ రంగాల్లో విజయాలు సాధించాలన్నారు. గ్రేస్ మినిస్ట్రీస్ డైరెక్టర్ మోగులూరి ఎలీషా తదితరులు పాల్గొన్నారు. కేక్ కట్ చేశారు.

రెడ్డిగూడెం: స్థానిక ఫ్రెండ్స్ సర్వీసు సొసైటీ ఆధ్వర్యంలో శుక్రవారం మహిళా దినోత్సవం సందర్భంగా మంత్రిత్వశాఖ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వశాఖ విజయవాడ నెహ్రూ యువ కేంద్రం సౌజన్యంతో నారీశక్తి ఫిట్‌నెస్ రన్స్ ప్రోగ్రాం జరిగింది. మహిళలకు పరుగుపందెం నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఫ్రెండ్స్ సర్వీసు సొసైటీ అధ్యక్షుడు చాట్ల విజయ్‌కుమార్, విజయ్, విశ్వనాథ్, నెహ్రూ యువజన కేంద్రం వలంటీర్ మరీదు కోటేశ్వరరావు, రత్న, అన్నపూర్ణ, సింధు పాల్గొన్నారు. ఉమెన్ ఫిట్ ఇండియా హిట్ అంటూ నినాదాలు చేశారు.